'పురం'లో మరిన్ని పరిశ్రమలు

రూ.90.80 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గానికి త్వరలో మరిన్ని పరిశ్రమలను తీసుకొని వచ్చి, ఈ ప్రాంతంలో ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. శుక్రవారం నాడు బాలకృష్ణ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పట్టణంలోని మెయిన్ బజారులో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన జామియా మసీదు పనులను పరిశీలన చేశారు. పశువుల ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న మెడిసన్ స్టోర్ రూమ్ భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. లేపాక్షి మండలం మానేంపల్లి గ్రామంలో రూ.16 లక్షలతో నిర్మాణం చేసిన కొండరిల ఆశ్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బాలకృష్ణ మాట్లాడుతూ హిందూపురం నియోజక వర్గంలో విరివిగా పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిలమత్తూరులో ఇండస్ట్రియల్ క్లస్టర్ ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల అభివద్ధి కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్‌జిఎస్) కింద రూ. 90.80 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని వైద్య పరికరాలను తీసుకుని వచ్చి, అన్ని రకాలుగా అభివద్ధి చేసి అందరికీ మెరుగైన వైద్య సేవలు అందే విధంగా చూస్తామన్నారు. నూతనంగా నిర్మాణం చేస్తున్న జామీయ మసీదుకు నిధులను తీసుకొచ్చి, ప్రారంభించిన పనులు వేగవంతంగా పూర్తి అయ్యే విధంగా చూస్తాం అన్నారు.

పట్టణంలో నూతనంగా నిర్మించిన కింగ్ స్టార్ జిమ్‌ను బాలకృష్ణ ప్రారంభించారు. జిమ్‌లో ఉన్న పరికరాలను ఉపయోగిస్తూ, కాసేపు సరదాగా జిమ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు షఫీవుల్లా, సమీయుల్లా, ట్రైనర్లు ఇలియాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో శుక్రవారం సాయంత్రం మంత్రి సవితమ్మతో కలసి బాలకృష్ణ నూతనంగా మూడు బస్సులను ప్రారంభించారు. మంత్రి జెండా ఊపి ప్రారంభిస్తే, బాలకృష్ణ డ్రైవింగ్ చేశారు.

నూతన బస్సును నడిపి ప్రారంభిస్తున్న బాలకృష్ణ

ఊపిరిపోయని ఓడీఓపీ..!

వన్ డిస్ట్రిక్ట్, వన్ ప్రొడక్టు (ఒడిఒపి) కింద గార్మెంట్ పరిశ్రమ కోసమని రాయదుర్గం టెక్స్‌టైల్స్‌ను ఎంపిక చేశారు. దీని కింద రాయదుర్గంలో తయారయ్యే గార్మెంట్ పరిశ్రమకు ఊతమిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆచరణలో అవి కేవలం నోటిమాటలుగానే మిగిలిపోయాయి. గార్మెంట్స్ పరిశ్రమకు ఊపిరిపోస్తుంది అనుకున్న ఒడిఒపి కూడా ఒట్టిదే అని ఆచరణలో తేలింది. ప్రభుత్వాల సాయం లేకపోవడంతో ఈ పరిశ్రమ రోజురోజుకు కూనారిల్లుతూనే ఉంది. యూనిట్స్ అనేక మూతపడుతుండటంతో దీనిపై ఆధారపడి కార్మికులు ఇతర పనుల్లోకి వెళ్లే పరిస్థితులు నెలకొంటున్నాయి. మారుతున్న వ్యాపార ధోరణికి అనుగుణమైన మార్పులు చోటు చేసుకోకపోవడం, అందుకు తగ్గట్టు ప్రభుత్వ ప్రోత్సహం కరువవడంతో గార్మెంట్ పరిశ్రమ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది.

మూతబడిన టెక్స్‌టైల్ పార్కు కామన్ స్పెషిలిటీ సెంటర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాయదుర్గం ప్రాంతంలో పెద్ద యూనిట్స్‌గా ఉన్నవి సుమారు 200 వరకు ఉన్నాయి. ఇవి కాకుండా టెక్స్‌టైల్స్ పార్కులో ఎనిమిది యూనిట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా గార్మెంట్ దస్తుల తయారీలో కట్టింగ్, స్టిచ్చింగ్, డైయింగ్, ఐరన్, ప్యాకింగ్ ఇలా వివిధ విభాగాలుంటాయి. ఇవన్నీ కలిపి ఒకేచోట ఉన్న పెద్ద పరిశ్రమలూ ఉన్నాయి. అలా కాకుండా ఏ విభాగానికి ఆవిభాగం విడివిడిగానున్న యూనిట్స్ ఉన్నాయి. ప్రధానంగా స్టిచ్చింగ్‌లో రాయదుర్గం పట్టణంలోనే సుమారు 600 యూనిట్స్ వరకు ఉన్నాయి. ఇందులో సుమారు 18 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ స్టిచ్చింగ్ యూనిట్స్ వరకే చూస్తే సుమారు 50 శాతం వరకు అంటే 300కుపైగా యూనిట్స్ మూతపడ్డాయి. ఉన్న యూనిట్స్‌లోనూ గతం అంత పనిలేదని యజమానులు చెబుతున్నారు. మొత్తం ఒకేచోటనున్న పెద్ద పరిశ్రమలు టెక్స్‌టైల్ పార్కులో ఎనిమిది ఉండగా అందులో ఐదు మూతపడ్డాయి. కేవలం మూడు మాత్రమే నడుస్తున్నాయి. టెక్స్‌లైట్స్ పార్కులో 54 యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా సౌకర్యాలున్నాయి. అయినా పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

మూతబడిన టెక్స్‌పార్కు

జీన్స్ ప్యాంట్లకు స్టిచ్చింగ్ చేస్తున్న కార్మికుడు

◆ నానాటికీ దిగజారుతున్న గార్మెంట్స్ పరిశ్రమ

◆ మూతపడ్డ శిక్షణ కేంద్రం

◆ ఉపాధికి దూరం అవుతున్న కార్మికులు

ఒడిఒపి కింద ఉన్నా ప్రయోజనం శూన్యం

రాయదుర్గం గార్మెంట్ పరిశ్రమను ఒడిఒపి కింద ఎంపిక చేశారు. దీన్ని ప్రోత్సహిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తగ్గట్టుగా తగిన ప్రోత్సహం ప్రభుత్వాల వైపు నుంచి ఉండటం లేదు. కనీసం ఎంఎస్ఎంఇలకు ఇవ్వాల్సిన ఇన్సెంటీవ్‌లు కూడా ఇవ్వడం లేదు. విద్యుత్ ఇన్సెంటీవ్‌లు బకాయిలే ఉన్నాయి. ఇక కనీసం ఈ వృత్తిలోకి కొత్తగా వచ్చే వారికి ఇస్తామని ప్రకటించిన శిక్షణ కూడా ఉండటం లేదు. ఈ రకంగా శిక్షణిస్తామని ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఒక సంస్థతో చేనేత జౌళి శాఖ ఒప్పందం కూడా చేసుకుంది. ఆచరణలోకి అదీ రాలేదు. శిక్షణ కోసం ఏర్పాటు చేసిన భవనాలున్నా ప్రయోజనం లేకుండా ఉంది.

మూసేసుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి...

రాయదుర్గంలోని టెక్స్‌లైట్స్ పార్కులో ఉన్న తన యూనిట్‌లో వంద మందికిపైగా కార్మికులు పనిచేసేవారు. మొదటి జీఎస్టీ వచ్చాక దాన్ని అవగాహన చేసుకోవడానికి ఒకటిన్నర సంవత్సరం సమయం పట్టింది. అది సరిచేసుకునేలోపు కోవిడ్ వచ్చి లాక్‌డౌన్ వచ్చింది. లాక్‌డౌన్‌తో ఆ ఏడాది అంతా పనిలేకుండాపోయింది. పరిశ్రమ ఏర్పాటు కోసం చేసిన బ్యాంకు రుణభారం తలకు మించిన భారమైంది. ఇంకోవైపు ప్రభుత్వమిస్తామన్న ప్రోత్సహకమూ సకాలంలో ఇవ్వలేదు. ఇక కోవిడ్ కారణంగా మార్కెట్‌లో సరుకుకు అంత డిమాండ్ లేకుండాపోయింది. అంతేకాకుండా అప్పటి నుంచి ఈ-కామర్సు వ్యాపారం పెరిగింది. అప్పటి వరకున్న ఆఫ్‌లైన్ వ్యాపారం మొత్తం దెబ్బతినిపోయింది. ఈ -కామర్సు వ్యాపారం చేయాలంటే ఆ కంపెనీలకు తగ్గట్టు సరుకు పెద్దఎత్తున ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అది సాధ్యపడని పరిస్థితుల్లో పరిశ్రమలను మూతేసుకోవాల్సి వచ్చింది.

ఖలీల్, మూతపడ్డ పరిశ్రమ యజమాని.

గార్మెంట్స్ పరిశ్రమ బాగా దెబ్బతింది

రాయదుర్గంలో సుమారు 200 యూనిట్స్ ఉన్నాయి. ఇందులో 20 నుంచి 30 యూనిట్స్ మూతపడ్డాయి. తక్కినవి కూడా అంత ఆశాజనకంగా లేవు. కోవిడ్, నోట్ల రద్దు, జీఎస్టీ ఇలా అన్ని రకాలుగా వ్యాపారంపై దెబ్బ పడింది. ఇప్పటికీ అది కోలకోలేదు. అంతకు మునపు ఉన్నంత డిమాండ్ ఇప్పుడు లేదు. పైగా ముడిసరుకు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో గిట్టుబాటు కూడా అయ్యే పరిస్థితి లేకుండా ఉంది. పరిశ్రమలు మూతపడుతుండటంతో అనేక మంది ఈ రంగం నుంచి ఇతర వృత్తులోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రోత్సహకాలను అందించడంతోపాటు, మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపైనా దృష్టి సారించాలి.

వెంకటేశ్ , రాయదుర్గం గార్మెంట్ ఓనర్స్ అసోసియేషన్ కోశాధికారి.

ఈ రంగం నుంచి తప్పకున్నా..

20 సంవత్సరాలుగా గార్మెంట్‌లో స్టిచ్చింగ్ కార్మికునిగా పనిచేస్తున్నాను. స్వయంగా నేను కుట్టడమే కాకుండా నాతోపాటు మరో 30 మంది చేత స్టిచ్చింగ్ చేయించేవాడిని. గడిచిన రెండేళ్లుగా అనుకున్నంతగా ఆర్డర్లు రావడం లేదు. సాధారణంగా వినాయకచవితి సమయంలో వారానికి మూడు వేల వరకు ఫ్యాంట్లు కుట్టడానికి ఆర్డరు వచ్చేవి. ఇప్పుడు కనీసం వెయ్యి కూడా రావడం లేదు. ఇక నేను ఏమి తినాలి... నాతోపాటున్న వారికి ఏమివ్వాలి. అందుకే గిట్టుబాటు కాక మూతేసుకున్నాను. వేరే పని కోసం వెతుక్కుంటూ ఉన్నాను.

సురేష్, స్టిచ్చింగ్ కార్మికుడు.

భయపెడుతున్న డెంగీ

కోడూరు, చిలమత్తూరు పంచాయతీల్లో కేసులు

కోడూరు బిసి కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు

ప్రజాశక్తి-చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో డెంగీ వ్యాధి విజంభిస్తోంది. కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రయివేటు ఆసుపత్రులకు రోగులతాకిడి ఎక్కువగా ఉంది. మొదట టైఫాయిడ్ లక్షణాలు ఉండి అనంతరం ప్లేట్‌లెట్స్ కౌంటింగ్ తగ్గతుండటంతో డెంగీ పాజిటివ్ వస్తోందని వైద్యులు చెబుతున్నారు. డెంగీ కేసులు పెరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కాలంలో చెదురుమదురు వర్షాలు వస్తుండడంతో గ్రామాల్లో రోడ్లపై నీటినిల్వ పెరిగింది. ఈ కారణంగా నీరు కలుషితం కావడం, దోమలు వృద్ధి చెందడం వల్లే డెంగీ వ్యాధి ప్రబలుతున్నట్టు తెలుస్తోంది. మొదట కోడూరులో ఈ వ్యాధి లక్షణాలతో 9 ఏళ్ల చిన్నారి ఆసుపత్రిలో చేరింది. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వారం రోజుల పాటు అడ్మిట్ అయ్యి చికిత్సలు చేయించుకున్న అనంతరం ఆరోగ్యం కుదుటపడినట్లు బాదిత కుటుంబ సభ్యులు తెలిపారు. అదే గ్రామంలో మూడేళ్ల చిన్నారికి డెంగీ పాజిటివ్ వచ్చింది. దీంతో కోడూరు పంచాయతీలో ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తుంది. జ్వరం భారిన పడ్డ వారంతా కర్నాటకలోని ప్రయివేటు ఆసుపత్రులకు చికిత్స నిమిత్తం వెళ్తున్నారు. వీరిలో కొందరికి డెంగీ పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది. చిలమత్తూరు పంచాయతీలో కూడా కొంత మంది ఈ వ్యాధి బారినపడ్డారు. కోడూరులో ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు వైద్యులు చెబుతున్నారు. జ్వరం రాగానే ప్రయివేటు ఆసుపత్రికి వెళ్తుండడంతో అక్కడ డెంగీగా నిర్ధారణ అయిన కేసులు ప్రభుత్వ లెక్కలోకి రావడంలేదు. మండలంలో డెంగీతో పాటు విషజ్వరాలు అధికంగా ఉండటంతో అటు ప్రభుత్వ ఆసుపత్రితో పాటు ప్రయివేటు, ఆర్ఎంపి వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్య పనులు లోపించినట్లు తెలుస్తోంది. కోడూరు, చిలమత్తూరు పంచాయతీల్లో ట్యాంక్‌లు శుభ్రం చేయడం లేదు. డ్రెయినేజీల్లోనూ పూడికతీత పనులు చేపట్టకపోవడం అపరిశుభ్రత పెరిగి దోమలు వ్యాపిస్తున్నాయి. దీనీ కారణంగానే విషజ్వరాలు, డెంగీ వ్యాధులు ప్రభలుతున్నాయి. ఇప్పటికైన అధికారులు గ్రామాల్లో పారిశుధ్యపనులు చేపట్టడంతో పాటు మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

అధికారులకు మంత్రి సవిత హెచ్చరిక

ప్రజాశక్తి- పెనుకొండ

విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులపై వేటు తప్పదని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మంత్రి శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో పెనుకొండ అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం తోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధమనే లక్ష్యంతో సిఎం చంద్ర బాబు పాలన సాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి కల సాకారం కావాలంటే అధికారుల సహాయ సహ కారాలు ఎంతో అవసరమన్నారు. అధికారులు సమన్వయంతో కలిసికట్టుగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించే అధికారులు ఎవరైనా, ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి నాయకులు అధికారులకు తోడ్పాటు అందించాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సమావేశాలకు విధిగా హాజరుకావాలని సమయపాలన పాటించాలని సూచించారు. విద్యుత్, రెవెన్యూ, హౌసింగ్, శానిటేషన్, రక్షిత తాగునీరు, ప్రజారోగ్యంతో పాటు అత్యవసర సేవలపై యుద్ధప్రాతిపదికన స్పందించాలని ఆదేశించారు. అంతకుముందు మంత్రి శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. సమావేశంలో మాజీ జడ్పిటిసి నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య, పట్టణ పార్టీ కన్వీనర్ శ్రీరాములు, అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

రేపు యుటిఎఫ్ టీచర్స్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్

పెనుకొండ టౌన్ : యుటిఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవ సంబరా ల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ క్రికెట్, చెస్ టోర్నమెంట్లు నిర్వాహించా మని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, ఎం.సుధాకర్, టోర్నీ కన్వీనర్ జీసీ. నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణస్వామి తెలిపారు. పట్టణంలో శుక్రవారం వారు మాట్లా డుతూ టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను జులై 13వ తేదీ పెనుకొండ పట్టణంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ చేత ప్రారంభించామన్నారు. మొత్తం 16 జట్లు పాల్గొనగా వివిధ సెలవు దినాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఫైనల్ పోరులో భాగంగా పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ధర్మవరం, రొళ్ల జట్లు తలపడతాయని తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌కు ఉపాధ్యాయులు, యుటిఎఫ్ ఆఫీస్ బేరర్లు, రాష్ట్ర కౌన్సిలర్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు రమేష్, ఉపేంద్ర, రవీంద్రనాథ్, గంగాధర్, మారుతి, శేషాద్రి, ఎంకె.నబి, ఆదిజినేష్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్స్ క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కెజిబివిని సందర్శించిన ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్

కెజిబివిలో కోతుల నుంచి రక్షణ కల్పించండి

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని కెజిబివిలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థినులకు కోతుల నుంచి రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ డిమాండ్ చేశారు. కెజిబివిలో విద్యార్థినులపై శుక్రవారం కోతులు దాడి చేశాయన్న విషయం తెలిసిన వెంటనే ఆయన పాఠశాలను సందర్శించారు. కోతుల బెడదపై విద్యార్థినులు, ఉపాధ్యాయ బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. కొండ ప్రాంతం దగ్గరగా ఉండటంతో కోతుల బెడద ఎక్కువగా ఉందని వారంలో రెండు మూడుసార్లు విద్యార్థినులు, ఉపాధ్యాయినులపై దాడి చేస్తున్నాయని వాపోయారు. ప్రధానంగా భోజనం సమయంలో గుంపుగా వస్తాయని, ఈ రోజు ఇంటర్ విద్యార్థినిపై దాడి చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి కెజిబివిలోకి కోతుల రాకుండా చర్యలు తీసుకోవాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు.

కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

లేపాక్షి : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివద్ధి చేస్తానని ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. మండలంలోని మానేంపల్లి పంచాయతీ పరిధిలోని కొండారెడ్డి ఆశ్రమంలో మాజీ ఎంపి కేశినేని నాని నిధుల(రూ. 16లక్షలు)తో కమ్యూనిటీ భవనం నిర్మించారు. దానిని శుక్రవారం ఎమ్మెల్యే బాలయ్య ప్రారంభిం చారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సిఐ జనార్ధన్, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, ఇంజినీర్ హనుమ నాయక్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు

పిఆర్ ఈఈ, కంప్యూటర్ ఆపరేటర్‌కు ఉత్తమ అవార్డులు

మడకశిర : పంచాయతీ రాజ్ ఈఈ మురళీమోహన్, పట్టణంలోని ఎంఆర్‌సి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రంగనాథ్‌కు ఉత్తమ అవార్డులు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మురళీమోహన్, రంగనాథ్ గురువారం పుట్టపర్తిలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో అవార్డులు అందుకున్నారు. మురళీమోహన్‌నకు అవార్డు రావడంపై రామ్మోహన్, ఇంజినీర్ నవీన్, శ్రీనివాసులు, సంధ్యారాణి, సబ్ డివిజన్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సిబ్బంది, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే రంగనాథ్‌కు అవార్డు రావడంపై ఎంఇఒలు శ్రీనివాసభాస్కర్, నరసింహామూర్తి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

డిఇఒ నుంచి అవార్డు అందుకుంటున్న రంగనాథ్

దశల వారీగా 'సూపర్ సిక్స్' పథకాల అమలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర

'సూపర్ సిక్స్' పథకాలను ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుందని ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తెలిపారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో భాగంగా సిఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను ప్రారంభించి అతి తక్కువ ధరకు పేదల కడుపు నింపుతున్నారన్నారు. తొలి విడతగా వంద అన్న క్యాంటీన్లను ప్రారంభించారని, మరో విడతలో 103 ప్రారంభిస్తారన్నారు. గత ప్రభుత్వంలో జగన్ కక్ష కట్టి అన్న క్యాంటీన్లను రద్దు చేసి భవనాలను ఇతర కార్యక్రమాలకు ఉపయోగించుకోకుండా నిరుపయోగంగా మార్చేశారన్నారు. అన్న క్యాంటీన్లు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరమని చంద్రబాబు వాటిని పున:ప్రారంభించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న మంచి పథకాలను చూసి ఓర్వ లేని జగన్, వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు.

వాటర్ సప్లై స్కీంను కొనసాగించండి : కౌన్సిలర్

ప్రజాశక్తి-మడకశిర

నగర పంచాయతీలో ఇంటింటికీ తాగు నీరందించేందుకు గత ప్రభుత్వంలో మెగా ఇంజినీరింగ్ సంస్థ ద్వారా రూ. 60 కోట్ల వ్యయంతో చేపట్టిన మడకశిర వాటర్ సప్లై ఇంప్లిమెంట్ స్కీంను కొనసాగించాలని కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర ఓ ప్రకటనలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజును కోరారు. ఈ స్కీంలో భాగంగా బేగార్లపల్లి, గొల్లహట్టి, మారుతి నగర్, జూనియర్ కళాశాల, న్యూ ఎస్సీ కాలనీ, గుట్ట ఆంజనేయస్వామి గుడి, వల్లినాకనపల్లి వద్ద మొత్తం ఏడు ట్యాంకుల నిర్మాణం చేపట్టారన్నారను. న్యూ ఎస్సీ కాలనీ వద్ద ట్యాంకు నిర్మాణం పూర్తికాగా, మారుతి నగర్‌లో నిర్మిస్తున్న ట్యాంకుకు పైలెట్ ప్రాజెక్టు ద్వారా పైపులైన్ వేసి నీరు ఇవ్వాలనుకుని అర్ధాంతరంగా ఆపివేశారన్నారు. కావున ఆ ప్రాజెక్టు పనులను పూర్తి చేయించాలని కోరారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

లేపాక్షి : ఉత్తమ అవార్డు అందుకున్న లేపాక్షి విద్యుత్ శాఖ ఇంజినీర్ వెంకటేశ్వర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్‌ను శుక్రవారం లేపాక్షి విద్యుత్ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రజలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి శాఖా పరంగా సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడే సమాజంలో మనకు గుర్తింపు దక్కుతుందన్నారు. ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో మండల ప్రజలకు మరింత సేవ చేస్తామన్నారు. ఈ అవార్డు రావడంతో తమపై మరింత బాధ్యత పెరిగింద న్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాబా ఫకృద్దీన్, పుష్ప ప్రభాకర్, బాబా మండలంలోని లైన్‌మెన్‌లు పాల్గొన్నారు

అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఉద్యోగులు

నాసిరకం పనులతో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

రొద్దం : ఇటీవల మండల వ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాలకు నూతనంగా విద్యుత్ లైన్లు లాగారు. చాలా మార్గాల్లో అప్పటికే రోడ్డు పక్కన కాలువలు ఏర్పాటు చేశారు. ఆ కాలువ పక్కనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఓ వైపు ఒరిగాయి. ప్రధానంగా మండలం లోని వైటి రెడ్డిపల్లి, రంగాపురం గ్రామాలకు వెళ్లే మార్గంలో ఓ మలుపులో విద్యుత్ స్తంభాలు పూర్తి స్థాయిలో ఓ వైపు ఒరిగాయి. విద్యుత్ తీగలు కూడా పక్కకు తొలగి కిందకు వేలాడుతూ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ లైన్లను సరి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓ వైపు ఒరిగిన విద్యుత్ లైన్

స్థానిక నాయకులతో షేక్‌బాబ్జాన్

షేక్‌బాబ్జాన్‌కు సన్మానం

నంబులపూలకుంట : ఆంధ్ర ప్రదేశ్ దళిత మిత్ర సంఘం అన్నమయ్య జిల్లా సంఘం సభ్యులు బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్‌బాబ్జాన్‌ను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి 7వ దళిత మిత్ర సంఘం ఆవిర్భావ సభకు హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఒబిసి మోర్చా మండల అధ్యక్షులు కెవి. రమణ, మైనారిటీ మోర్చా మండల అధ్యక్షులు షేక్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని కప్పలబండ గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య వంతమైన జీవనం, సాగించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తి గత శుభ్రత పాటించాలని సూచించారు. డ్రైడే ఫ్రైడే పాటించి జ్వరాల బారిన పడకుండ ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పంచాయతీ కార్యదర్శి గోపాల్ రెడ్డి, సిబ్బంది అపర్ణ, ప్రమీల, ఆశా కార్యకర్త జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు

ధర్మవరం రూరల్ : మండల పరిధిలోని నే ఒగాటి పల్లి పంచాయతీలో ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నారు. పది రోజులుగా జరుగుతున్న ఉపాధి పనుల్లో పాల్గొంటున్న తమకు జీవనభృతి కలుగుతోందని కూలీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

నల్లచెరువు : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న పాధ్యాయులకు రెండు రోజుల పాటు స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ తిరుపాల్‌నాయక్ తెలిపారు. 17న రత్నాలపల్లి క్లస్టర్, 18న కేబులకుంట క్లస్టర్ పరిధిలోని ఉపాధ్యాయులకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సేవ చేయడంలో సంతృప్తి

ధర్మవరం టౌన్ : రోగులకు సేవ చేయడంలో సంతృప్తి ఉంటుందనిశ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నారాయణ సేవ అనే కార్యక్రమములో భాగంగా 360 మందికి భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లను వైద్యులు, సిస్టర్స్ చేతులమీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా గర్భిణులకు స్వీట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నారాయణ సేవా కార్యక్రమానికి దాతగా బుక్కపట్నం వెంకటలక్ష్మి భర్త వెంకటేష్ వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంటెంట్ మాధవి, 27 మంది సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

డీఎస్పీకి అభినందనలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన కదిరి డీఎస్పీ శ్రీలతకు అభినందలు వెల్లువెత్తాయి. గురువారం శ్రీ సత్యసాయి జిల్లా పోలీస్ పరేడ్ మైదానములో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డీఎస్పీ శ్రీలత ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీలత మాట్లాడుతూ విధులలో అంకిత భావంతో పనిచేయడంతో తనకు ఉత్తమ డీఎస్పీగా అవార్డు వచ్చిందన్నారు. ఈ అవార్డు తనకు విధులు పట్ల మరింత బాధ్యత పెంచిందన్నారు. ఉత్తమ అవార్డు అందుకోవడంతో డీఎస్పీకి సిబ్బందితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

IN THE COURT OF THE ADDL. JUNIOR CIVIL JUDGE, HINDUPUR
O.S.No:326/2022

Between :
M/s Red-Rock properties k. Hindoput Represented by its partner S.M.Mansoor Ahamad **...Plaintiff**

And

Vadde Govindappa and others **...Defendants**

SUMMONS TO THE DEFENDANTS 1 TO 11

To:
01) Vadde Govindappa S/o Late V.Gangavaram Hanumapp.
02) Vadde Thimmappa S/o Late V.Gangavaram Hanumappa.
03) Vadde Thimmakka w/o Late Vadde Pujari Venkatappa.
04) Vadde Gangamma w/o Late Vadde Venkateshappa.
05) Vadde Dhana Lakshmi d/o Late Vadde Venkateshappa,
06) Vadde Harish S/o Vadde Govindappa,
07) Vadde Venkatesh S/o Vadde Thimappa,
08) Vadde Suresh S/o Vadde Thimmappa,
09) K.V.Gundappa S/o Eranna,
10) Warisuddin Naveed Syed S/o Ali Tamwar, residing at 4-1-1236/3. King Koti, Abids Hyderabad- 500 001
11) C.Sreenivasulu S/o C.Venkataramudu, Sugur-Village. Hindupur-Mandal

Defendants 1 to 3, 6 to 9 are the residents of Appalakunta, Hindupur-Mandal. Defendants 4 and 5 arc residents of D.No.6-25, Honnabhavi, Pavagada-Town, Tumkur-Dist.

Take notice that the above matter stands posted to 03.09.2024 for your appearance and hence you are required to attend either in person or through your advocate on the above said date at 10.30 A.M. before the above said court. failing which the matter will be decided exparte.

K.Satyanarayana, Advocate, Hindupur, 9440259524.

ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యలతో పుట్టపర్తిలో కలకలం

సత్యసాయి జిల్లా కేంద్రం హిందూపురానికి మారనుందా,?
మరో ఉద్యమానికి సిద్ధం అంటున్న జిల్లా వాసులు

హిందూపురంలో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం పుట్టపర్తికాకుండా హిందూపురానికి మార్చుతారని, పేరు మాత్రం శ్రీ సత్య సాయి జిల్లా గా ఉంటుందని ప్రచారం సాగుతుండటంతో పుట్టపర్తి పరిసర నియోజకవర్గాలలో ఆందోళన వ్యక్తం అవుతోంది. శుక్రవారం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు ఆందోళన కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లా ప్రధాన కేంద్రాన్ని హిందూపురానికి మార్చుతామని ఎన్నికలలో ఇచ్చిన హామీపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా స్పందించిన బాలకృష్ణ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామని ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని చూద్దాం అని వ్యాఖ్యానించారు. దీంతో జిల్లా మార్పు అనే అంశం పై కలకలం రేపుతోంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు పుట్టపర్తి మధ్యలో ఉండటంతో పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా గత వైసిపి ప్రభుత్వం 2022 మార్చి 4న ప్రకటించింది. అప్పటి వైసిపి పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి జిల్లాలోని మెజార్టీ ఎమ్మెల్యేలతో సంతకాలు సేకరించి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సమర్పించారు. దీంతో అన్ని విధాల ఆలోచించి పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు జరిగింది. అంతేగాక ఈ ప్రాంతంలోని యువత జిల్లా సాధన కోసం ర్యాలీలు, సంతకాలు సేకరణ, ఉద్యమాలు చేసింది. ముఖ్యంగా పుట్టపర్తిలో జిల్లా కు కావలసిన అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. జిల్లా ఏర్పడడంతో వెనుకబడిన ఈ ప్రాంతం అభివృద్ధి అవుతుందని ప్రజలు భావించారు. జిల్లా ఏర్పాటు కావడంతో పలువురు బిల్డర్లు కోట్ల రూపాయలతో భవన నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికిప్పుడు పుట్టపర్తి అభివృద్ధి కాకున్నా కొంత ఆలస్యంగా నైనా అభివృద్ధి అవుతుందని ఆశతో ఈ ప్రాంత వాసులు ఉన్నారు. హిందూపురం పట్టణం అయినప్పటికీ అది ఒక మూలగా ఉంటుందని అక్కడ జిల్లా కేంద్రం అయితే అతి సమీపంలో ఉన్న కర్నాటక రాష్ట్రంలోని కొంతమేరకు అక్కడ వారు అభివృద్ధి చెందుతారని ఇక్కడి ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని పలువురు విశ్లేషిస్తున్నారు. జిల్లా కేంద్రం మార్పు జరిగితే ప్రజా ఉద్యమం తప్పదని పలువురు యువకులు, ప్రజలు అంటున్నారు. అయితే కొందరు రాజకీయ విశ్లేషకులు ఈ విషయాన్ని కొట్టిపారేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రం అనేక సమస్యలతో సతమతమవుతోందని అంటున్నారు. జిల్లా మార్పు అనే అంశం సున్నితమైందని ఈ తుట్టెను కదిలిస్తే ఎలా ఉంటుందో పాలకులు తెలుసని అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా కేంద్రం మార్పు ఆలోచనే చేయకపోవచ్చునని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతానికైతే ఈ అంశంపై చర్చనీయాంశమైంది.

అంధకారంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రి

రెండు గంటలపాటు విద్యుత్‌సరఫరా బంద్
ఇబ్బందులు పడ్డ రోగులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

చుట్టుపక్కల పది మండలాల రోగులకు కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఒక్కటే పెద్దదిక్కు. అలాంటి ఆసుపత్రికే రోగం వచ్చింది. శుక్రవారం సాయంత్రం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ లేక అంధకారం నెలకొంది. రెండు గంటల పాటు విద్యుత్ లేకపోడంతో రోగులు ఒకపక్క ఉక్క పోత మరోపక్క దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విద్యుత్ సమస్య ఎప్పుడో ఒక్కసారి కాదు తరచూ ఉత్పన్నమవుతోంది. అసలే సరైన వైద్య సదుపాయాలు లేక సకాలంలో మెరుగైన వైద్యం అందక రోగులు ఇబ్బంది పడుతుంటే మరోపక్క విద్యుత్తు లేక ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సమస్యపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా ఆసుపత్రిలో విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అంతరాయం ఏర్పడిందన్నారు.

చీకటిలో ఆసుపత్రిలోని వార్డు

పట్టు రైతుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పట్టురైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం పట్టు రైతులకు, రీలర్లకు రావాల్సిన ప్రోత్సహకాలు ఇంత వరకు విడుదల కాలేదని దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పట్టణంలో ఉన్నా పట్టు గూళ్ల మార్కెట్ శిథిలావస్థలో ఉందని, చిన్న పాటి వర్షానికే కారుతుందని చెప్పారు. మార్కెట్ నిర్మాణానికి పట్టు పరిశ్రమ శాఖ అధికారులు అంచనాలు వేసి ప్రభుత్వనికి నివేదిక ఇవ్వడం జరిగిందనిదీనిపై కేంద్ర పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో చర్చించి నిధులు తీసుకు వస్తే నూతన మార్కెట్ నిర్మాణం జరుగుతుందని వివరించారు. అదే విధంగా గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మొదటి దశలోనే మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా హిందూపురం నియోజకవర్గంలోని చెరువులన్నిటిని నీరు నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, పట్టు రైతు సంఘం నాయకులు సిద్ధారెడ్డి, జయరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, సడ్లపల్లి శీన తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను బాలకృష్ణకు వివరిస్తున్న పట్టు రైతులు

రోగులకు కంప్యూటర్ ఒపి స్లిప్పులు అందజేయాలి

అసుపత్రి ఆవరణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రధాన ఆసుపత్రికి వచ్చే రోగులకు కంప్యూటర్ ఒపి స్లిప్పులు అందజేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలను, వైద్య సేవలను గురించి సంబంధిత వైద్యాధికారుల ద్వారా ఆరా తీశారు. పార్కింగ్ ఏరియాని పరిశీలించారు, ఆసుపత్రి నందు పలు వార్డులకి సంబంధించిన సైన్ బోర్డు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రిలో సాంకేతిక పరికరాలు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూస్తామన్నారు. రెండు నెలల్లో ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ డేవిడ్ రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఓబులమ్మ, వైద్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అసుపత్రి సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం

హిందూపురం జిల్లా అసుపత్రిని జిల్లా కలెక్టర్ చేతన్ తనిఖీ చేసే సమయంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ అందుబాటులో లేక పోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గతంతో ఒక సారి పరిశీలన సమయంలో సైతం ఆయన అందుబాటులో లేక పోవడం గమనార్హం. సూపరింటెండెంట్ సమయపాలన పాటించక పోతే వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఎలా పాటిస్తారని కలెక్టర్ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం.

నేడు వైద్య సేవలు నిలిపివేత: ఐఎంఎ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కోల్ కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన సామూహిక అత్యాచారం, హత్యకు నిరసనగా జాతీయ ఐఎంఎ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఎ పిలుపు మేరకు శనివారం 24 గంటలపాటు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు మదన్ కుమార్ పేర్కొన్నారు. అందులో భాగంగా కదిరి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో, అత్యవసర సేవలు మినహాయించి వైద్యసేవలు నిలిపివేయడం జరుగుతుందని ఐఎంఎ కదిరి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిరసన తర్వాత ప్రభుత్వాలు తీసుకునే చర్యలను బట్టి తదుపరి కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందని, తమ డిమాండ్లు సాధించేవరకు ఈ ఉద్యమాన్ని ఆపేది లేదని, అవసరమైతే మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించింది. తమ న్యాయమైన డిమాండ్లకు ప్రజలు,ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పక్షాలు మద్దతు ఇవ్వాలని కోరుతోంది.

బత్తలపల్లి : వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్యకు నిరసనగా శనివారం తమ ఆసుపత్రిలో వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు ఆర్డీటీ బత్తలపల్లి ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

గాండ్లపెంట : మండలంలో 2023 – 24 సంబంధించిన పనులు పై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 17వ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఈ నేపథ్యంలో గ్రామాలు వారిగా జరిగిన ఉపాధి పనులు, అక్రమాల గురించి అధికారులు చదివి వినిపించారు. జరిగిన అక్రమాలకు సంబంధించిన మొత్తాన్ని రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీడీ రమేష్ బాబు, డిపిఒ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారులు రాజ్ కుమార్, ఎంపీడీవో రామానాయక్, ఎపిఎం సూర్యనారాయణ, ఉపాధి ఈసీ సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రజాప్రతినిధులు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయి వర్ధంతి

ధర్మవరం టౌన్ : మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన విజయవాడలోని తన స్వగృహంలో మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వంద రోజుల విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని అన్ని శాఖల అధికారులు 100 రోజుల విజన్ డాక్యుమెంట్‌ను సిద్ధం చేసి నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో సిపిఒ ఆధ్వర్యంలో విజన్ 2047 పై జిల్లాలోని అన్ని శాఖల హెచ్‌ఒడిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు డిఆర్ఒ కొండయ్య, సిపిఒ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చే విధంగా విజన్ ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. రానున్న రోజుల్లో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. ప్రతి సామాన్యునికి ఫలాలు అందాలని రాష్ట్రస్థాయి నుంచి మండల, కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్ గా ప్రణాళికలు రచించాలన్నారు. 100 రోజుల విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని పేర్కొన్నారు. జిల్లాలోని వనరులు అభివద్ధికి గల అవకాశాలు డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. ఆరోగ్యం, సంక్షేమం, సుస్థిరత, సామాజిక అభివద్ధి తదితర వివరాలను పొందుపరచాలని హెచ్‌ఒడిలను కలెక్టర్ ఆదేశించారు. అలాగే 2024 నుంచి 2029 వరకు శాఖల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి జయచంద్ర, వ్యవసాయ శాఖ అధికారి సత్యనారాయణ, సిపిఒ కార్యాలయం ఏడీ ప్రకాష్ రావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం : ఎమ్మెల్యే బాలకృష్ణ

అల్పాహారం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లను రాష్ట్రంలో మళ్లీ ప్రారంభించారని హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ, జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం హిందూపురం పట్టణంలో అన్న క్యాంటీన్లను ప్రారంభించి, పేదలకు అల్పాహారం వడ్డించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంతో మంది కార్మికులు, అభాగ్యులకు కడుపు నిండా అన్నం దొరుకుతుందని అన్నారు. నిర్వాహకులు నాణ్యత, శుభ్రతను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలపై నిర్లక్ష్యం వద్దు

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జిల్లా ఎస్‌పితో పాటు పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం తన నివాసంలో ఎస్పీ వి. రత్న, డిఎస్‌పి కంజాక్షన్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా హిందూపురం నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలు ఎప్పటికప్పుడు అదుపులో ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలను తీవ్రంగా పరిగణించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిజమైన బాధితులు పోలీస్ స్టేషన్లకు వస్తే వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అయితే అక్రమార్కులు ఎవరైనా, ఎంతటి వారైనా ఉపేక్షించవద్దని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఈ సమీక్షలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్ధన్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని సిద్ధారెడ్డి కాలనీకి చెందిన యువకుడు రంజిత్ రెడ్డి(24) ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న రంజిత్ రెడ్డి తరచూ కడుపు నొప్పితో ఇబ్బంది పడుతూ పలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో శుక్రవారం కడుపునొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

గుండెపోటుతో మేకల కాపరి మృతి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని కొడపగానిపల్లికి చెందిన మేకల కాపరి బాబయ్య (32) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. బాబయ్య శుక్రవారం ఉదయం మేకలు మేపడానికి గ్రామం బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా విషయాన్నితెలియజేశారు వెంటనే 108 కి ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే బాబయ్య మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.మృ తునికి భార్య సరస్వతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాబయ్య మృతితో ఆ కుటుంబం వీధిన పడింది వీరి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టూ టౌన్ సిఐగా అబ్దుల్ కరీం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ టూ టౌన్ సిఐగా అబ్దుల్ కరీం శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, పట్టణ వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇప్పటికే పట్టణంలో రెండు స్టేషన్ లలో ఎస్ఐగా పని చేయడంతో పాటు రూరల్ స్టేషన్ లో ఎస్ఐగా విధులు నిర్వహించిన అనుభవం తనకు ఉందని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన డిఎస్పి కంజాక్షన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సరికాదు..

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

శ్రీ సత్య సాయిజిల్లా పేరును కొనసాగిస్తూ హిందూపురం జిల్లా కేంద్రం చేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. ఈ మేరకు సిఐటియు మండల కన్వీనర్ బైపల్లి గంగాధర్ మాట్లాడుతూ ఒకసారి జిల్లా కేంద్రం ప్రకటించిన తర్వాత మరో చోటుకు జిల్లా కేంద్రాన్ని మార్చాలనుకోవడం మంచిది కాదని అన్నారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి ఇలా జిల్లా కేంద్రాలను మార్చుకుంటూ పోతే ఏ ప్రాంతమూ అభివృద్ధి చెందదని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హిందూపురం ప్రాంతం అభివృద్ధి చెందాలని తాము కూడా కోరుకుంటామని అలా అని పుట్టపర్తిని కాదని హిందూపురం పట్టడానికి జిల్లా కేంద్రాన్ని తీసుకుపోవడాన్ని తాము ఖండిస్తున్నామని అన్నారు.

నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నిరుద్యోగ యువతకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.కళ్యాణి తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిసెస్ భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ కంపెనీలో లోన్ అధికారులుగా 150 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. నెలవేతనం 14,575 రూపాయలని ఆసక్తి గల 18 నుంచి 28 సంవత్సరాల వయసు గల వారు ఇంటర్ లేదా, గ్రాడ్యుయేషన్ ఉన్న యువకులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని అన్నారు. మీ విద్యా అర్హతలు గల ఒరిజినల్, జిరాక్స్ పత్రాలతో పాటు ఏదేని గుర్తింపు కార్డుతో జిల్లా ఉపాధి కార్యాలయం కోర్టు రోడ్డు అనంతపురంలో ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలని ఆమె తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమవుతుందని టిడిపి నాయకులు అన్నారు. ఈ మేరకు వారు శుక్రవారం 36వ వార్డులో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వార్డుల్లో కాలువలు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో 35 వ వార్డు ఇన్‌ఛార్జి రాయపాటి శివ, సచివాలయం శానిటరీ ఇన్స్‌పెక్టర్ అమర్నాథ్, టిడిపి నాయకులు కంది కుంట భద్రాచలం, బీరే కేశవ, సెక్షన్ ఇన్‌ఛార్జులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా టీచర్స్ క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కదిరి ఎస్ టి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో ఫ్రెండ్స్ టీచర్స్ క్రికెట్ పోటీలు నాలుగవ రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. మొదటి మ్యాచ్లో నల్లమాడ జట్టుపై ఎన్ పి కుంట జట్టు 71 పరుగుల తో విజయం సాధించింది. ఉత్కంఠ భరితంగా సాగిన రెండవ మ్యాచ్లో తనకల్–1 జట్టుపై గాండ్లపెంట జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడవ మ్యాచ్లో ముదిగుబ్బ జట్టుపై ఓడిసి జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది. మాన్ అఫ్ ది మ్యాచ్ అవార్డులను పలు ఉపాధ్యాయ సంఘం నాయకులు తాహెర్ వలి, రామ్మోహన, సురేంద్ర, రుద్రమరెడ్డి, ఆజం భాష, గంగాధర్ రెడ్డి ఆటగాళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు శ్రీనివాసులు, అశ్వర్థ నారాయణ, వెంకట్, మనోహర, నాగేంద్ర, శివరామకృష్ణ, గోపాల్‌తో పాటు ఆరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్ : అమరావతిలోని ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్‌ను కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంత్రి లోకేష్‌తో జరిగిన భేటీలో కదిరి నియోజకవర్గంలో గతంలో ఆగిపోయిన పెండింగ్ పనులకు సంబంధించి నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

నారాలోకేష్‌తో 'కందికుంట'

బలిజసేవా సంఘం మండల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి - నల్లచెరువు

బలిజసేవా సంఘం మండలకమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. మండలం కేంద్రంలో ఖాదర్ సినిమా హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీకృష్ణా దేవరాయ బలిజ సేవ సంఘాన్ని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షులుగా గొర్ల చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈసందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ బలిజల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతకుంట శ్రీనివాసులు, దృడం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు

ప్రజాశక్తి- పరిగి

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు హిందూపురం నుండి ఇచ్ఛాపురం వరకు కృతజ్ఞత యాత్ర నిర్వహిస్తున్న ఆయనకు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు తమ మద్దతు తెలిపారు. పరిగి నుండి హిందూపురం వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కుంటిమద్ది ఓబులేషు, ఆశాది గంగిశెట్టి రామ్మోహన్, దాచేపల్లి రామాంజనేయులు, కడప హరిబాబు, పెనుగొండ నరసింహులు, మంద నరేష్, దాచేపల్లి మద్దిలేటి, గోవిందప్ప, జిల్లా కార్యదర్శి రామాంజిరప్ప, శ్రీనివాసులు, రామదాసు, ఊటకూరు ఆంజనేయులు, కోడిగినహళ్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యస్కూల్‌లో వరలక్ష్మీ వ్రతం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

స్థానిక సాయినగర్ లో గల సూర్య ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడు వై నరేంద్ర బాబు ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహించినారు. పాఠశాల లోని విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభావతి, జ్యోతి, శ్యామల, హేమలత, మారుతి, శీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్య పాఠశాలలో వరలక్ష్మివ్రతం వేడుకలు